నిర్భయంగా విధులు నిర్వర్తించేలా....



వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారి వెంట వచ్చే సహాయకులు కొన్ని సమయాల్లో అనుచితంగా ప్రవర్తించి వైద్యులను, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తుంటారు. అలాంటి ఊహించని పరిణామాలను ఎదుర్కోవడం కష్టం. అలాంటి అత్యవసర పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండాలి. లేకుంటే నిర్భయంగా విధులు నిర్వర్తించలేం.

– డాక్టర్ బి.దీప్తి, ప్లాస్టిక్ కాస్మోటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, కడప

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



వైద్యులు, సిబ్బంది తాము విధులు నిర్వహిస్తున్న ప్రదేశాలు, ఆసుపత్రులలో అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ తమ సెక్యూరిటీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. రాత్రిళ్లు పనిచేసే ఉద్యోగులు తమ విధుల విషయంలోనే గాక వ్యక్తిగతంగానూ జాగ్రత్తలు పాటించాలి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ప్రభుత్వం ప్రయాణ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– డి.ఎస్. షర్మిల, స్టాఫ్ నర్స్, ప్రభుత్వ వైద్యశాల, రిమ్స్, కడప



వెంటనే శిక్షలు అమలుచేయాలి



కోల్‌కత్తా లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు వెంటనే శిక్ష పడేలా చూడాలి. ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. సంఘటనలు జరిగినపుడు బాధపడేకంటే అవి జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ బి.సుప్రజ, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ దంత వైద్య కళాశాల

సెక్యూరిటీ వ్యవస్థ బలోపేతం చేయాలి



ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలు, కళాశాలల్లో పని చేసే వారికి భద్రత కల్పించేందుకు సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఎవరికీ ఇబ్బంది కలుగకుండా భద్రతా సిబ్బందితోపాటు సీసీ కెమెరా వ్యవస్థ అందుబాటులో వుండాలి.

– డాక్టర్ ఎ.అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫార్మకాలజీ, రిమ్స్, కడప

క్లుప్తంగా

దివ్యాంగులకు అన్నదానం



భవిత కేంద్రంలో అన్నదానం

కడప సెవెన్‌రోడ్స్: న్యాయవాది దివంగత వీణా అజయ్‌కుమార్ సేవలు మరువలేనివని డీఆర్‌డీఏ అదనపు పథక సంచాలకులు ప్రసాద్ అన్నారు. అజయ్‌కుమార్ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు నగరంలోని భవిత మానసిక వికలాంగుల ఆశ్రమంలో దివ్యాంగులకు బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అమర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డులోని నయారా పెట్రోలు బంకు సమీపంలో ఆయిల్ ట్యాంకర్..ఓ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ప్రసాద్ (35) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. చెన్నూరు మండలం నజీర్‌బేగ్‌పల్లెకు చెందిన ప్రసాద్ కడప నగరానికి వచ్చి ఆటోలో తిరిగి చెన్నూరుకు వెళ్తున్నారు. చెన్నూరు వైపు నుంచి రాజంపేటకు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనా స్థలాన్ని చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలెక్టర్ గారూ...చొరవ చూపండి



ఇటీవల కడప నగరాన్ని తెలియజేస్తూ ఆంగ్ల అక్షరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

కడప కల్చరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అమలుకు చొరవ చూపాలని ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య కోరారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో తెలుగు భాష కనీసం రెండు శాతం అమలుకు నోచుకోక పోవడం బాధాకరమన్నారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఈ-ఆటోలు పంపిణీచేయాలి



ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ–ఆటోలు, ట్రాక్టర్లు నిరుద్యోగులకు పంపిణీ చేయాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్ కోరారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో జిల్లాకు ఆటోలు, ట్రాక్టర్లు, క్లీనింగ్ మిషన్లు మంజూరు చేశారని, కొన్ని మాత్రమే గతంలో పంపిణీ చేశారన్నారు. మిగిలిన 28 ట్రాక్టర్లు, 75 ఆటోలు నగరంలోని మహిళా శక్తి ప్రాంగణంలో నిరుపయోగంగా ఉంచడంతో తుప్పుపట్టి పనికి రాకుండా పోయే ప్రమాదముందన్నారు. అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువతకు వాటిని పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, శ్రీనాథ్, విష్ణు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ ప్రారంభం



బ్యూటీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్, డొమినోస్ బిల్డింగ్ రెండో అంతస్తులో రాధికారెడ్డి, సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ×హెయిర్ సైన్ బ్యూటీ పార్లర్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో హెయిర్ సైన్ బ్యూటీ పార్లర్‌ను ఏర్పాటు చేయడం నిజంగా సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, రహీం ,లారెన్స్, శ్రీనాథ్, బ్యూటీ పార్లర్ ను ఏర్పాటుచేసిన రాధికా రెడ్డి, సంపత్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆనాడే క్రీడా కాంతులు

ఆటలంటే మాటలు కాదు.. సరైన శిక్షణ కావాలి.. కఠోర సాధన చేయాలి.. అందుకు తగ్గ సదుపాయాలు కావాలి.. పోటీలకు నిధులు ఉండాలి.. నైపుణ్యం తోడవ్వాలి.. అప్పుడే మట్టిలో మాణిక్యాలు మెరుస్తాయి.. క్రీడా వెలుగులు విస్తరిస్తాయి.. మెరికల్లాంటి క్రీడాకారులు ఉన్నారు.. శిక్షణ అందించే శిక్షకులు ఉన్నారు.. కానీ వారిని సానబెట్టి క్రీడాతలంలో నిలబెట్టాలంటే సరైన శిక్షణ సదుపాయాల్లేవు.. కనీసం మైదానాలు లేవు.. పోటీల నిర్వహణకు తగు ప్రోత్సాహం లేదు.. క్రీడాలోకానికి ఆదర్శంగా నిలిచిన క్రీడాదిగ్గజంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం..

- ప్రవేశాల ఊసులేని వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల
- నేడు జాతీయ క్రీడాదినోత్సవం

కడప స్పోర్ట్స్: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారు ఒక స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్, తైక్వాండో, స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్ వంటి క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులు మరెందరో ఉన్నారు. క్రికెట్‌లో జిల్లాకు ప్రత్యేకస్థానం ఉంది. ఇందు కోసం ప్రాథమిక స్థాయి నుంచి వ్యాయామ విద్యను ప్రవేశపెట్టారు కానీ దాని అమలు తీరును పర్యవేక్షించడం, కావాల్సిన వసతులు, సామగ్రిని అందజేయడం మరిచిపోయారు. ఇక ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను చదువుల యంత్రాలుగా మారుస్తున్నారే తప్ప క్రీడలకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారు.



వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం

పట్టణ ప్రాంతాల్లో ఆడుకునేందుకు క్రీడామైదానాల కొరత కనిపిస్తుంటే.. గ్రామీణ ప్రాంతాల్లో వసతులు, కోచ్‌ల కొరత వేధిస్తోంది.

ప్రవేశాల ఊసేలేని వైఎస్ఆర్ క్రీడా పాఠశాల..

2006 డిసెంబర్ 30వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రాంతీయ క్రీడా పాఠశాలగా ప్రారంభమై రాష్ట్ర స్థాయికి ఉన్నతీకరణ చెందింది. అయితే ప్రస్తుతం క్రీడా పాఠశాలలో ఇంటర్మీడియట్ లేకపోవడంతో పతకాలు వచ్చే సమయానికి క్రీడాకారులు పదో తరగతి పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్నారు. ప్రతియేటా జూలై నెలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమై ఆగస్టు నాటికి పూర్తయ్యేది. ఈ యేడాది ఆగస్టు నెల పూర్తి కావస్తున్నా ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ ఇప్పటి వరకు విడుదల కాకపోవడం గమనార్హం. ఇక మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా ఎంపికల అనంతరం మెడికల్ టెస్టుల తర్వాత ప్రవేశాలు నిర్వహించే ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం రెండు నెలలు పట్టే అవకాశం లేకపోలేదు. ప్రవేశాల కోసం విద్యార్థులు అటు రెగ్యులర్ పాఠశాలలకు వెళ్లలేక, శిక్షణ పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్రీడాపాఠశాల ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.

▶▶ వైఎస్ఆర్ హయాంలో క్రీడల ప్రగతి..

గత ప్రభుత్వాలు అన్ని సౌకర్యాలు కల్పించినా టీడీపీ ప్రభుత్వంలో ఆదరణకరవైంది. 2009 జనవరి 24న ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా కడప నగరంలోని డీఎస్‌ఏ ఆవరణంలో రూ.5.1 కోట్లతో వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం ప్రారంభించారు. ఆయన స్వయానా రూ.50 లక్షల సొంత నిధులు వెచ్చించడంతో వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానం ఏర్పాటైంది. అనంతరం రూ. 8 కోట్లతో పునరుద్ధరించారు. 2021లో రూ.4 కోట్లతో ఫ్లడ్ లైట్స్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయగా.. గతేడాది అందుబాటులోకి వచ్చింది.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.30 లక్షలకు పైగా వెచ్చించి బాస్కెట్‌బాల్ కోర్టు, రూ. 9 కోట్లతో హాకీ టర్ఫ్ కోర్టు, స్కేటింగ్ రింక్ నిర్మాణాలు చేపట్టారు. రూ. 35 లక్షలతో అల్ట్రామోడల్ జిమ్‌సెంటర్ అందుబాటులోకి తెచ్చారు. అంతేగాక వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పులివెందుల పట్టణంలో రూ.17.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుచేశారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో కడప మెయిన్ స్కూల్ రాష్ట్ర స్థాయిలో 1040 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి పురస్కారానికి ఎంపికై ంది. గతంలోనూ వాలీబాల్ క్రీడలో జిల్లాకు చెందిన కరీముల్లా, వసుమతి అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో చంద్రారెడ్డి రాణించారు. ఎ.శివరామకృష్ణ యాదవ్ 2019లో కామన్‌వెల్త్ యూత్ గేమ్స్‌లో స్వర్ణం, మరోసారి రజతం సాధించి సత్తాచాటాడు. పెండ్లిమర్రి మండలం గోపాలపురానికి చెందిన శివగణేష్‌రెడ్డి జాతీయ స్థాయిలో రాణించి ప్రొకబడ్డీలో తెలుగు టైటాన్స్ తరపున ప్రాతినిధ్యం వహించాడు. ఆర్.టి.పల్లికి చెందిన కె.రామ్మోహన్ అల్టిమేట్ ఖోఖో లీగ్ పోటీల్లో రాణిస్తున్నాడు. గతేడాది ఆడుదాం ఆంధ్రలో ఉత్తమ క్రీడాకారులుగా నిలిచారు.



హాకీ సాధనలో క్రీడాకారులు..

సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి యువజనోత్సవాలు

కడప స్పోర్ట్స్: జిల్లాస్థాయి యువజనోత్సవాలు సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. సాయిగ్రేస్ తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా పలు అంశాలలో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల యువతీ, యువకులు (15–29 వయస్సు) సంబంధిత పోటీలలో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలని కోరారు. పోటీల వివరాలు..

థీమాటిక్ పోటీలు: సైన్స్ ప్రాజెక్ట్స్ థీం (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ – టెక్నాలజీ), సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం (గ్రూప్ – సోలో), జానపద గేయం (గ్రూప్– సోలో) ప్రత్యక్ష కార్యక్రమం, జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, కథా రచన, పెయింటింగ్, డిక్లమేషన్ (ప్రకటన), యువ విభాగంలో హస్తకళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99492 98810, 9849497011 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

కడప అర్బన్: చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ కడప రెండవ అదనపు మెజిస్ట్రేట్ కె. భార్గవి బుధవారం తీర్పునిచ్చారు. ఫిర్యాదు దారుని న్యాయవాది భరణికుమార్ నాయుడు వివరాల మేరకు కడప నగరంలో నివాసమున్న నందవాసి శ్రీధర్ 2018లో కడప నగరంలోని శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రూ. 4 లక్షల రుణం తీసుకున్నాడు. తరువాత కొంత డబ్బుచెల్లించాడు. అతడు చెల్లించాల్సిన బాకీ డబ్బుకు గాను 2019లో రూ. 2,89,000 ఎస్.బి.ఐ బ్యాంకుకు సంబంధించిన చెక్కు ఇచ్చాడు. కంపెనీవారు చెక్కును బ్యాంకులో వేయగా చెక్‌బౌన్స్ అయింది. కంపెనీ నిర్వాహకులు కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశారు. నందవాసి శ్రీధర్‌పై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

క్రీడలకు ఎల్ఐసీ నుంచి ప్రోత్సాహం



క్యారమ్స్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న అధికారులు

కడప కల్చరల్: క్రీడలకు జీవిత బీమా సంస్థ తగిన ప్రోత్సాహం ఇస్తోందని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ.రవికుమార్ అన్నారు. కడప నగరంలోని శ్రీనివాస రెసిడెన్సీలో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఎల్ఐసీ ఉద్యోగులకు జోనల్ స్థాయి చెస్, క్యారమ్స్ టోర్నమెంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎల్ఐసీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా ప్రదర్శిస్తున్నారని తెలిపారు. స్పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సభ్యులు జే సురేష్ మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రతిష్ఠాత్మకమైన ఈ పోటీలు నిర్వహించే అవకాశం మరోసారి రావడం తమకు గర్వకారణమన్నారు. మేనేజర్ పిఅండ్ఐఆర్.సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ కడప ఎల్ఐసీ జోనల్ టోర్నమెంట్ల విజేతలు ఎల్ఐసీ జాతీయ పోటీలలో పాల్గొంటారన్నారు. అనంతరం క్రీడాస్ఫూర్తి పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శర్మ, జలీల్, ఉదయ్ కుమార్ నాయుడు, రఘునాథరెడ్డి, చంద్రపాల్, సంజయ్ కుమార్, రామాంజనేయులు, రెడ్డి భాస్కర్, లక్ష్మీనారాయణ, రమేష్ బాబు, బాబు, రఘు, అక్బర్ బాషా, వీరయ్య, మోసెస్ పాల్గొన్నారు.

వైవీయూలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: మానవ మేధస్సుకు, మానసిక వికాసానికి కళలు ముఖ్యమని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ శాఖ పూర్వ విద్యార్థుల (2010–2024) ఆధ్వర్యంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూపూర్వ విద్యార్థులు కలసి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ పది బ్యాచ్‌ల విద్యార్థుల చిత్రాలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయని, రెండు తెలుగు రాష్ట్రాలలో మన లలితకళా విభాగం మంచి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ విశ్రాంత డైరెక్టర్ జి గోపాల్, ఆర్ట్స్ విభాగ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, డా.కోట మృత్యుంజయరావు, వెంకటేష్, చిన్న రాయుడు, బి.ఈరప్ప, డాక్టర్ రెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే మరో విద్యుత్ పోరాటానికి శ్రీకారం చుడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు.

బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ అమరుల సంస్మరణ సభ సందర్భంగా ఆనాటి బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదే విధానాన్ని తెలుగు దేశం కూటమి ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధపడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు వెంకట శివ, దస్తగిరి రెడ్డి, రామ్మోహన్, బి.మనోహర్, ఐఎస్ సుబ్బమ్మ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అమర వీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

ఉత్సాహంగా ఆటల పోటీలు ప్రారంభం



తైక్వాండో క్రీడాకారులతో డీఎస్‌డీఓ తదితరులు



బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన పలు క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాక్సింగ్, తైక్వాండో, హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం ఈ నెల 29న నిర్వహించ నున్నట్లు తెలిపారు. కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఏడు రోడ్లు, పాత రిమ్స్, శ్రీకృష్ణదేవ రాయల సర్కిల్ నుంచి డీఎస్‌ఏ క్రీడా మైదానం వరకు గురువారం 3కే ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అట్టహాసంగా పోటీలు నిర్వహించి వివిధ పోటీల్లో విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు అమృత్‌రాజ్, అబ్దుల్ మునాఫ్, కల్యాణ్, విజయభాస్కర్‌రెడ్డి, కె. వెంకటేష్, అనిల్, స్టెప్ సిబ్బంది నారాయణ, నాగయ్య, అబ్బాస్ అలీక్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

కడప అర్బన్: కడప నగరంలోని ముత్తరాసపల్లెకు చెందిన వృద్ధురాలు సాయమ్మ (60) అనారోగ్యంతో కమలాపురంలో మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచగా, కమలాపురం పోలీసుల సిఫారసు మేరకు మేము సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో కె.అయ్యవారయ్య, రామరాజు, శివరాం, నరసింహ, నాగేశ్వరరావు, పుల్లయ్య, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు

అత్యుత్తమ జట్లను ఎంపిక చేయాలి

ఇంటర్ విద్య ఆర్‌జేడీ ఎస్. రవి



మాట్లాడుతున్న ఇంటర్ విద్య ఆర్‌జేడీ ఎస్. రవి


కడప స్పోర్ట్స్ : ఇంటర్మీడియట్ విద్య పరిధిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన (ఎస్‌జీఎఫ్) అండర్–19 క్రీడా ఎంపికలను పారదర్శకంగా నిర్వహించి అత్యుత్తమ జట్లను ఎంపిక చేయాలని ఇంటర్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎస్. రవి సూచించారు. బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డీవీఈఓ బి. వెంకటసుబ్బయ్య అధ్యక్షతన, ఎస్‌జీఎఫ్ అండర్–19 ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌జేడీ మాట్లాడుతూ అండర్–19 బాలబాలికల ఎంపికల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఉత్తమ జట్లను పంపించాలని సూచించారు. డీవీఈఓ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కళాశాలల్లో విద్యార్థులను క్రమశిక్షణతో పాటు క్రీడల్లో రాణించేలా సుశిక్షితులను చేసే బాధ్యత ఫిజికల్ డైరెక్టర్లపై ఉందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు మంచి జట్టును పంపడం ద్వారా పతకాలు సాధించవచ్చని తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్–19 ఆర్గనైజింగ్ సెక్రటరీ సి. శారద మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ పోటీల సీజన్ ప్రారంభమైందని, ఫిజికల్ డైరెక్టర్లు సహకారం అందించి ఎంపికలు, పోటీలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎస్‌జీఎఫ్ ఎంపికల షెడ్యూలును విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి. సూర్యారావు, ఫిజికల్ డైరెక్టర్లు అరుణకుమారి, ఎస్. విజయప్రసాద్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి ప్రదాత.. ఆరోగ్య మాత

కడప కల్చరల్ : నగరంలోని ప్రముఖ చర్చిలలో ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం ఒకటి. లోక రక్షకుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి అందించిన పరమ పునీత... ఆరోగ్య మాత. కడప నగరం రైల్వే స్టేషన్ వద్దగల ఆరోగ్యమాత క్షేత్రంలో ఏటా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 1977లో నాటి కడప పీఠాధిపతులు ఎస్ఏ అరుళయ్య ఆరోగ్యమాత పుణ్య క్షేత్రాన్ని పూర్తి స్థాయిలో తీర్చిదిద్దారు. 2007లో నాటి క్షేత్రం గురువులు ఫాదర్ సగిలి ప్రకాశ్ నూతన చర్చి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. 2009లో కొత్త చర్చి పూర్తయింది. మోస్ట్ రెవెరెండ్ ఫెడ్రో లోపేజ్ క్వింటానా చర్చిని ప్రారంభించారు. నగర వాసులతోపాటు జిల్లా నలుమూలల నుంచి విశ్వాసులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. పాత చర్చి ప్రక్కనగల స్టాండ్స్‌లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థన చేస్తారు. ఈ క్షేత్రం ఆధ్వర్యంలో భక్తులు ఊదా రంగు దుస్తులు ధరించి 41 రోజులపాటు అమ్మవారి దీక్ష వహిస్తారు.

నేటి నుంచి ప్రారంభం

ఆరోగ్య మాత ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అతిథులుగా కర్నూలు మేత్రాసన పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ బిషప్ గోరంట్ల జ్వోనేష్ హాజరై సాయంత్రం 5 గంటలకు పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారని ఆలయ ప్రతినిధులు తెలిపారు. సెప్టెంబరు 6వ తేదీ వరకు నవ దిన ఉత్సవాలు పేరిట ప్రతిరోజు ప్రార్థనలు నిర్వహిస్తామని, 7న నగర వీధుల్లో మరియతల్లి తేరు ప్రదక్షిణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 8న కడప అపోస్థలిక పాలనాధికారి రెవరెండ్ బిషప్ బలిపూజ నిర్వహిస్తారని తెలిపారు.



విద్యుద్దీపాలంకరణలో ఆరోగ్యమాత చర్చి

వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలి

కడప అగ్రికల్చర్: డీసీఎంఎస్ పరిధిలో వ్యాపారాల అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని జాయింట్ కలెక్టర్, డీసీఎంఎస్ ప్రత్యేకాధికారి అదితిసింగ్ సూచించారు. బుధవారం కడపలోని డీసీఎంఎస్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే పలు పథకాలకు సంబంధించి వస్తువులను డీసీఎంఎస్ ద్వారా విక్రయాలను చేపట్టి వ్యాపారాలను అభివృద్ధి చేయాలన్నారు. ఎరువుల అమ్మకం, విత్తనాల సేకరణ వంటి కార్యక్రమాలను కూడా డీసీఎంఎస్ ద్వారా నిర్వహించాలన్నారు. కార్యాలయంలో సిబ్బంది చాలా మందికి పనులు లేనట్లు తెలిసిందని వారికి ఏదో పనిని కల్పించాలని అధికారులను ఆదేశించారు. డీసీఎంఎస్ పరిధిలోని స్థలాలను ఉన్నతాధికారులు అనుమతి లేకుండా లీజుకు ఇవ్వకూడదని సూచించారు. కార్యాలయంలో లిఫ్ట్ ఏర్పాటుపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ సుభాషిణి, డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణి, డీసీఎంఎస్ డీఎం ఖాదర్‌బాషా, డీసీఎంఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్‌కు రూపమిచ్చిన మైనంపాటి

కడప కల్చరల్: తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్‌కు తన కుంచెతో రూపనిచ్చిన మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం తన జన్మ చరితార్థం చేసుకున్నారని యోగి వేమన విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా వైవీయూలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మైనంపాటి ఒక తపస్విలా దీక్షపూని బ్రౌన్ చిత్రపటం చిత్రించారన్నారు. సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ మైనంపాటి రచనలు తగినంత ప్రాచుర్యం లేక రాకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జానమద్ది విజయభాస్కర్, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఆచార్య జి.పార్వతి, జానమద్ది విజయభాస్కర్, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, జి.హరిభూషణరావు, ఎస్.రమేష్‌రావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం సిబ్బంది

ఏడుగురు జూదరుల అరెస్టు

కడప అర్బన్: కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ యువై.జయరాముడుకు అందిన సమాచారం మేరకు రామకృష్ణ నగర్‌లో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,500 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.